ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు



తిమ్మాపురంలో ప్రచారం చేస్తున్న జీవీఎంసీ 4వ వార్డు కార్పొరేటర్ కొండబాబు, నాయకులు



సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రి విడదల రజని, ఎమ్మెల్యే శ్రీనివాసరావు తదితరులు

- మొదటి ప్రాధాన్య ఓటుతో సుధాకర్‌ను గెలిపించండి
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

తగరపువలస: దేశంలోనే మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను పేదల ముంగిటకు చేరుస్తున్నారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనితో కలిసి అనిట్స్ ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్, డెంటల్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రాజధానుల ఏర్పాటుతో రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణకు పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగన్‌ను ప్రోత్సహించడానికి వైఎస్సార్‌సీపీ బలపరచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అన్ని రవాణా మార్గాలు కలిగిన విశాఖ పరిపాలనా రాజధానిగా సక్సెస్ అవుతుందన్నారు. ఇటీవల నగరంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం అయిందన్నారు. మరో ఏడాదిలో జరగనున్న సాధారణ ఎన్నికలకు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు శుభపరిణామం కావాలన్నారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తూనే విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యమిచ్చారన్నారు. రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తుండగా అందులో నాలుగు ఉత్తరాంధ్రలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం వైద్యరంగంలో ఇటీవల 48 వేల ఉద్యోగాలు భర్తీ చేయడమే కాకుండా పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఆరోగ్య క్లినిక్‌లను నిర్మించిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను 98 శాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వానికి ఇప్పటి ప్రభుత్వానికి అభివృద్ధిలో తేడా గమనించి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బలపరుస్తూ సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో మెడికల్ కళాశాల సీఈవో నిరంజన్‌కుమార్, ప్రిన్సిపాల్ రాధా మాధవ్ త్రిపాఠి, శివరామకృష్ణ, దంత కళాశాల ప్రిన్సిపాల్ వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని 4వ వార్డు కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు కోరారు. ఈ మేరకు తిమ్మాపురంలో గురువారం ప్రచారం చేశారు. స్థానిక నాయకులు వాసుపల్లి నల్లబాబు, మేరుగు చిన్నారావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో అనధికారిక బోర్డులు తొలగించండి

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



సాగర్‌నగర్ బీచ్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రాజాబాబు, అధికారులు

కొమ్మాది: బీచ్‌రోడ్డులో అనధికారిక బోర్డులను వెంటనే తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ 8వ వార్డు పరిధి గుడ్లవానిపాలెం అమ్మవార్ల గుడి ప్రాంగణం, సాగర్‌నగర్ బీచ్, రాడిసన్ బ్లూ హోటల్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో జీ – 20 సదస్సు జరగనున్న నేపథ్యంలో బీచ్ రోడ్డులో ఉన్న అనధికారిక బోర్డులను తొలగించాలని, తీర ప్రాంతాల సుందరీకరణ, విద్యుత్ అలంకరణ, అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బీచ్ రోడ్డు వ్యూ పాయింట్ల వద్ద పార్కింగ్, ప్లాంటేషన్, లైటింగ్ పనులు పద్ధతి ప్రకారం చేపట్టాలని, చెట్లను ఆకర్షణీయంగా ట్రిమ్మింగ్ చేయించాలని సూచించారు. సాగర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో సెంటర్ మీడియన్‌లలో పారిశుధ్యం, పచ్చదనం, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర పనులు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. బీచ్ రోడ్డు వెంట జరుగుతున్న అభివృద్ధి పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలని పర్యవేక్షణ ఇంజినీరు శ్యాంసన్ రాజును, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మిని ఆదేశించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారి బి.సురుష్ కుమార్, డీడీ (హార్టికల్చర్) ఎమ్.దామోదరరావు, జి – 20 సదస్సు లైజినింగ్ అర్గనైజర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ మారికవలస ఇండస్ట్రియల్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మధురవాడ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.సంతోష్ కుమార్ చెప్పారు. మారికవలస జంక్షన్, మారికవలస గ్రామం, టయోటా షోరూం, బిస్లరీ వాటర్ కంపెనీ, బోరవానిపాలెం, మారికవలస జేఎన్ఎన్‌యూఆర్ఎం రాజీవ్ గృహకల్ప కాలనీ, కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం, కాపులుప్పాడ డంపింగ్ యార్డు, డ్రైవర్స్ కాలనీ, జేకే లేఅవుట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ బొట్ట రవి తెలిపారు. సంగివలస, వలందపేట, శశి విద్యాసంస్థలు, తాటితూరు వాటర్ వర్క్స్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలి



మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి

కొమ్మాది: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని జోన్ – 2 కమిషనర్ కనక మహాలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గురువారం ఎండాడ అథ్లెటిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబాన్ని నడిపించగలిగే మహిళలు నేటి కాలంతో పోటీ పడి మరింత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సీతామహాలక్ష్మి, అల్లూరి పార్వతి, గోపి, కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన స్థాయి పరిశీలన

మధురవాడ: లీడ్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థుల బోధన స్థాయిలను మరింత వృద్ధి చేయాలని భీమునిపట్నం డైట్ లెక్చరర్ జీజీఎస్ నాగేశ్వరరావు సూచించారు. గురువారం ఆయన బక్కన్నపాలెంలోని ఎంపీయూపీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల అభ్యసన స్థాయి పరిశీలించి బోధనలో మెలకువలకు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసింహరాజు

పద్మనాభం: మండలంలోని శేరిఖండంలో మాజీ సర్పంచ్ పుప్పాల ఆదినారాయణ వర్ధంతి సందర్భంగా రెడ్డిపల్లి హైస్కూల్‌లో చదువుతున్న 10 మంది మెరిట్ విద్యార్థులకు, ఒక పేద విద్యార్థికి నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఆదినారాయణ కుటుంబ సభ్యులు సమకూర్చిన నగదు ఒక్కో విద్యార్థికి రూ.1,000 చొప్పున భీమునిపట్నం మాజీ ఎమ్మెల్యే ఆర్.ఎస్.డి.పి.అప్పలనరసింహరాజు గురువారం రాత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సిరుగుడి ఆదినారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరావు, శేరిఖండం సర్పంచ్ పి.చిన్నారావు, పుప్పాల తులసిబాబు, పుప్పాల అన్నన్నబాబు, శేఖర్ పాల్గొన్నారు.

చెత్త తరలింపులో సిబ్బంది నిర్లక్ష్యం

రోడ్డుపై వ్యర్థాలు పడడంతో వాహనచోదకులకు ఇక్కట్లు



చెత్తపై వల కప్పకుండా లారీలో తరలిస్తున్న దృశ్యం

ఆనందపురం : కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు చెత్త తరలింపు విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల్లో చెత్త తరలించేటప్పుడు రోడ్డుపై ఎగిరి పడకుండా, జారి పడకుండా వల కట్టాల్సి ఉంది. కానీ సిబ్బంది నిబంధనలు పాటించడం లేదు. జీవీఎంసీ పరిధిలోని భీమిలి ప్రాంతంలో సేకరించిన చెత్తను ఆనందపురం జాతీయ రహదారి మీదుగా వాహనాలతో కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. కానీ చెత్త పడకుండా కనీస చర్యలు తీసుకోవడం లేదు. సుమారు పది కిలోమీటర్ల దూరం వాహనాలు ప్రయాణిస్తుండంతో రోడ్డుపై చెత్త పడుతోంది. అది ద్విచక్ర వాహనదారుల కళ్లల్లో పడుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పాస్ పుస్తకాలు ఇప్పించాలని వినతి

తగరపువలస: భీమిలి మండలం నారాయణరాజుపేట పంచాయతీలో సుమారు 470 ఎకరాల ఇనాం భూములకుగాను 90 ఎకరాల్లోని జగన్నాథరాజు తదితరులకు చెందిన వివాదాస్పద భూములు, దేవాదాయశాఖ భూములు మినహాయించి సాగులో ఉన్న మిగిలిన రైతులకు పాస్ పుస్తకాలు ఇప్పించాలని రైతులు కోరారు. పంచాయతీలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇనాం భూములపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు సర్పంచ్ కాదా సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, లక్ష్మీపురం ఇన్‌చార్జి సర్పంచ్ బమ్మిడి అప్పన్న, మాజీ సర్పంచ్ కరుభుక్త జోగినాయుడు, సాగులో ఉన్న రైతులు హాజరయ్యారు. డీటీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుల ప్రతిపాదనలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ఐటీ సెజ్ కూడలిలో భద్రతకు చర్యలు



ఐటీ హిల్స్ జంక్షన్‌లో మాట్లాడుతున్న సీఐ రమేష్

మధురవాడ: ఐటీ హిల్స్, ఐటీ జంక్షన్‌లో మరింత భద్రత పెంచడంతోపాటు సీసీ కెమెరాలు అన్నిచోట్ల పనిచేసేలా చర్యలు చేపడుతున్నట్టు విశాఖ నార్త్ జోన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ డి.రమేష్ చెప్పారు. బుధ, గురువారాల్లో ఐటీ హిల్స్, జంక్షన్‌లో సిబ్బందితో కలిసి విస్తృతంగా ఆయన పర్యటించారు. సీసీ కెమెరాల పనితీరు, ఆకతాయిల వల్ల ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. మిథిలాపురి వుడా కాలనీ – మారికవలస – మానం ఆంజనేయులు కాలనీల నుంచి వచ్చే రోడ్డు కలిసే జంక్షన్‌లో ఆకతాయిల వల్ల తలెత్తుతున్న ఇబ్బందులు, చిల్లర దొంగతనాల వల్ల చిరు వ్యాపారులు, ఉద్యోగులు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులు, సీసీ కెమెరాలు పనిచేయకపోవడంపై ''రెచ్చిపోతున్న ఆకతాయిలు' శీర్షికతో గత నెల 20న సాక్షి పత్రికలో కథనం ప్రచురితమయింది. దీనిపై సీఐ స్పందించి విస్తృతంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిచేయని సీసీ కెమెరాలు తక్షణమే ఉపయోగంలోకి తీసుకురావడానికి, లైట్లు వెలగకపోవడంపై సంబంధిత అధికారులతో మాట్లాడుతామన్నారు. ఐటీ సెజ్‌లో పనిచేసే మహిళా ఉద్యోగుల రక్షణ కోసం పెట్రోలింగ్ రౌండ్స్ పెంచుతామన్నారు. ఇబ్బందులు ఎదురైతే తక్షణమే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా అమ్మవారి గరగ ఊరేగింపు



అమ్మవారి గరగ ఊరేగిస్తున్న భక్తులు

భీమునిపట్నం: భీమిలి గ్రామ దేవత నూకాలమ్మవారి చాటింపు వేడుక బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 20 నుంచి నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఆలయం వద్ద పూజారి చౌదరి సత్యరాజు ఆధ్వర్యంలో అమ్మవారికి బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి గరగను తంగేడు పూలతో అలంకరించారు. అనంతరం భారీ ఎత్తున భక్తులు వెంటరాగా పెద్దబజారు, చిన్నబజారు ప్రాంతాల్లో పులివేషాలు, సాముగారడీల ప్రదర్శనలతోపాటు బాణసంచా కాల్పులతో ఊరేగింపు నిర్వహించారు.

అనంతరం మెయిన్ రోడ్డు పాత బస్టాండ్ సమీపంలోని అమ్మవారి చదును పట్టు వద్ద గరగను ఉంచారు. ఉత్సవాలు ప్రారంభమయ్యే వరకు గరగను అక్కడే ఉంచి పూజలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో అమ్మవారి ఆలయ ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ వాసుపల్లి కొండబాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీరావు, ప్రధాన కార్యదర్శి ఆర్.ప్రభాకర్‌నాయుడు, కాసరపు ఎల్లాజీ, నమ్మి శేషు, ముమ్మిడిశెట్టి సునీల్, గంటా నూకరాజు, అడిదం అంజనీకుమార్, ఎచ్చర్ల హరి పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే లక్ష్యాలు చేరుకోగలం



ప్లాంకులు, పెన్నులతో పదో తరగతి విద్యార్థులు

ఆనందపురం : యువకులు వ్యక్తిగత నైపుణ్యాలను మెరుగుపరచుకున్నప్పుడే లక్ష్యాలను చేరుకోగలరని వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాకర సురేష్ అన్నారు. మండలంలోని శొంఠ్యాం ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధత – లక్ష్య సాధనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో అధికశాతం మార్కులు సాధించాలంటే విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని, అందుకోసం అభ్యసనా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సమయాన్ని నిర్దేశించుకొని రోజూ అంశాల వారీగా చదవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షలకు అవసరమైన ప్లాంక్‌లు, పెన్నులు, ఇతర సామగ్రి అందజేశారు. మేముసైతం సొసైటీ వ్యవస్థాపకుడు అక్కిరెడ్డి దేముడుబాబు, హెచ్ఎం కేవీ సుబ్బారావు, పీఈటీ కన్నారావు, మెహర్, కిరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గీతంలో న్యాయ అవగాహన సదస్సు

కొమ్మాది: భారత ప్రభుత్వం న్యాయ మంత్రిత్వశాఖ న్యాయవిభాగం, గీతం స్కూల్ ఆఫ్ లా సంయుక్తంగా రెండు రోజులపాటు నిర్వహిస్తున్న న్యాయ అవగాహన సదస్సు గురువారం ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా సీబీఐ విశ్రాంత అధికారి వీవీ లక్ష్మీనారాయణ మాట్లడారు. ప్రాథమికంగా పౌరులు తెలుసుకోవాల్సిన న్యాయపరమైన అంశాలు, బాధ్యతలపై వివరించారు. రవి రెబ్బాప్రగడ, ప్రొఫెసర్ అనితారావు పాల్గొన్నారు.

ఎండాడలో పాము కలకలం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో 6 అడుగుల పాము గురువారం సాయంత్రం కలకలం రేపింది. ఇక్కడ ఉన్న ఓ కార్‌కేర్ సెంటర్‌లో అకస్మాత్తుగా పాము కనిపించడంతో నిర్వాహకులు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే స్నేక్ క్యాచర్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేయగా ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని చాకచక్యంగా పామును పట్టుకుని నిర్మానుష్య ప్రదేశంలో విడిచిపెట్టారు.

పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలి



ఆర్‌డీవో భాస్కరరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న పింఛనర్ల సంఘ సభ్యులు

భీమునిపట్నం: భీమిలి తాలుకా పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలని పింఛనర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తట్టికోట భీమారావు, ముంజేటి ఆనందరావు గురువారం కోరారు. ఈ మేరకు ఆర్‌డీవో ఎస్.భాస్కరరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం డీఆర్ ఎరియర్లు వెంటనే అందివ్వాలని కోరారు. ఇటీవల పింఛన్ల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని, అలా కాకుండా సకాలంలో అందివ్వాలని కోరారు. హెల్త్ కార్డులు అందరికీ అందేవిధంగా చూడడంతోపాటు అన్ని రకాల ఆరోగ్య సమస్యల చికిత్సలు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ససమ్యలు పరిష్కరించాలని కోరారు.

మూడు రాజధానులతో ఉత్తరాంధ్రకు సువర్ణావకాశం



శ్యామ్‌నగర్‌లో కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



దాకమర్రి రఘు విద్యాసంస్థలో మాట్లాడుతున్న మంత్రి రజని



చిల్లపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

తగరపువలస: మూడు రాజధానులతో ఉత్తరాంధ్రకు సువర్ణావకాశం సిద్ధిస్తుందని, దీనిని బలపరుస్తూ వైఎస్సార్‌సీపీ మద్దతుతో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని కోరారు. గురువారం సాయంత్రం భీమిలి మండలం దాకమర్రి రఘు విద్యాసంస్థల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో సమావేశమయ్యారు. విద్యాభివృద్ధికి సీఎం జగన్ చేస్తున్న కృషిని వివరించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ మొదటి ప్రాధాన్య ఓటు సుధాకర్‌కు వేయడం ద్వారా విద్యావంతులు, మేధావులు అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, సర్పంచ్ చెల్లూరి పైడప్పడు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, పొట్నూరు చంద్రశేఖర్, ముద్దాడ సూరిబాబు పాల్గొన్నారు.

- జీవీఎంసీ రెండో వార్డు చిల్లపేటలో 200 మంది పట్టభద్రుల ఓటర్లతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డబ్బీరు ప్రశాంతి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, శిల్లా కరుణాకరరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి పాల్గొన్నారు.
- భీమిలిలోని సెడార్, బ్యాంకు కాలనీలోని విద్యాసాగర్, సంగివలసలోని వరల్డ్ అమేయా, సంతపేటలోని అంబేద్కరు జీవీఎంసీ హైస్కూల్, తగరపువలసలోని శ్రీబాసర విద్యాసంస్థల్లో ఎమ్మెల్యే ప్రచారం చేశారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, జీరు వెంకటరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అక్కరమాని మంగరాజు, శీరపు శ్రీరాములు, కె.ముత్యాలరావు, కొప్పల రమేష్, దుంపల ప్రభాకర్, ఉప్పాడ నాగేశ్వరరావు, జీవీ రమణ, పందిరి విజయ్, అల్లిపల్లి నరసింగరావు, చిల్ల గణేష్‌రెడ్డి, గుండాసి మధు, శిల్లా వంశీ పాల్గొన్నారు.
- మహరాజుపేట జెడ్పీ హైస్కూల్‌లో రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి, చిప్పాడ వెంకటేష్, సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు తదితరులు ప్రచారం చేశారు.

సుధాకర్ గెలుపు కోసం విస్తృత ప్రచారం

మధురవాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కి మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు స్వతంత్రనగర్ టైలర్స్‌కాలనీ, శ్యామ్‌నగర్, దోబీకాలనీ, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు, వాండ్రాసి రవికుమార్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్ర అప్పన్న, బంగారు ప్రకాశ్, బెల్లాపు పాపారావు, బ్రిక్ శ్రీనివాస్, పసుపులేటి గోపి, డాక్టర్ సూర్యనారాయణ, తమ్మిన వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రమాప్రభను గెలిపించాలని ప్రదర్శన



కారుషెడ్ కూడలిలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పీఎం పాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కోసం పోటీ చేస్తున్న కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ పలు సంఘాల నాయకులు గురువారం కారుషెడ్ కూడలిలో ప్రదర్శన చేశారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. స్థానిక సాంకేతిక, మాలతాంబ, శ్రీ చైతన్య విద్యా సంస్థల్లో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జోనల్ కార్యదర్శి పి.రాజ్‌కుమార్, వివిధ సంస్థల నాయకులు వై.రాము, వెంకటరావు, సుజాత, భారతి, కె.భాస్కర్, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు 24 మంది



పోటీలు ప్రారంభిస్తున్న మోహన్‌కృష్ణ

మధురవాడ: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలకు విశాఖ జిల్లా తరపున పాల్గొనే మహిళ, పురుష జట్లకు 24 మంది ఎంపికయ్యారు. మధురవాడ శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్‌లో ఎంపిక పోటీలను గురువారం మధ్యాహ్నం సంస్థ చైర్మన్ ఎమ్.మోహన్‌కృష్ణ ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య ఉత్సాహంగా పోటీలు జరిగాయి. వీరిలో 12 మంది చొప్పున పురుష, మహిళ జట్లను అబ్జర్వర్, ఎన్ఐఎస్ కోచ్ కె.చిట్టిబాబు పర్యవేక్షణలో ఎన్ఐఎస్ కోచ్‌లు కె.కావ్య, ఐ.చరణ్ ఎంపిక చేశారు. 9వ రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ అండ్ వుమెన్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు కాకినాడలో లేడీస్ క్లబ్ ద్రోణ అకాడమీలో శుక్రవారం నుంచి నిర్వహించనున్నారు.

రాష్ట్ర జట్లు ఇవే : రాష్ట్ర స్థాయి పోటీలకు మహిళ జట్టుకి కె.లిఖిత, బి.రాజేశ్వరి, ఎస్.లహరి, డి.శృతి ప్రియ, పి.ప్రసన్న, సీహెచ్.సాయిప్రభ, ఇ.జ్ఞానేశ్వరి, టి.లిఖిత, ఎ.జాహ్నవి, ఎమ్.జ్యోత్స్న, ఎస్.జ్యోతి, ఎస్.పూజిత ఎంపికయ్యారు. పురుషుల జట్టుకి ఎ.సంపత్, ఆకాశ్ వర్ధన్, ఎమ్.జోయల్ యశ్వంత్ కుమార్, జి.రుత్విక్, వి.దిలీప్ కుమార్, కె.కార్తీక్, కె.శివశంకర్, ఎ.జీవన్, వి.పూర్ణచంద్ర ప్రసాద్, ఎస్.రాజేష్, ఎస్.సత్యనారాయణ, కె.మనోజ్‌కుమార్ ఎంపికయ్యారు.

మనవడిని చూడటానికి వచ్చి మహిళ మృతి

తగరపువలస: గుంటూరు జిల్లా గురజాల మండలానికి చెందిన బూడూరి మంగమ్మ అనే మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మనవడు జయ ఆదిత్యను చూడటానికి వచ్చి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందింది. ఈ సంఘటన సంగివలసలో జరిగింది. భీమిలి ఎస్ఐ తాతారావు తెలిపిన వివరాల ప్రకారం... గురజాలకు చెందిన బూడూరి శివనారాయణ సంతపేట అంబేద్కరు స్కూల్ సమీపంలో అద్దెకు ఉంటున్నాడు. ఇటీవల ఆయన కుమారుడు జయ ఆదిత్యకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో సంగివలస ఎన్ఆర్ఐ జనరల్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఈ విషయం తెలిసిన మంగమ్మ బుధవారం గుంటూరు నుంచి మనవడిని చూసేందుకు విశాఖ వచ్చింది. సంగివలస హైవే వద్ద రోడ్డు దాటుతుండగా విజయనగరం నుంచి విశాఖవైపు వేగంగా వెళ్తున్న బైక్ బలంగా ఢీకొనడంతో ఆమె తల, రెండు కాళ్లు, ఎడమచేతికి తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే ఆమెను సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో ఉంచి చికిత్స చేయిస్తుండగా అదేరోజు రాత్రి మరణించింది. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.